# యుంపర్ వైఫ్

గెజెటెడ్డు ఆఫీసర్ అచ్చయ్యనాయుడు నిక్కర్ తొడిగి, బూట్సువేసి, పొట్టిచొక్కా టోరన్ లూస్‌గా వుంచుకు, హేట్ పెట్టుకు, బిళ్ళబంట్రోతు సమేతుడై స్టేషన్ ప్లాట్‌ఫారమ్ మీదకు వచ్చిరావడంలోనే తెలుసుకున్నాడు. " నాటి సాయం కాలం మెయిలు నూటఎనభై నిమిషాలులేటు " అని. 6 గంట లకు రావలసింది రాత్రి 9 గంటలకుగాని రాదన్నాడు బిళ్ళ బంట్రోతు వాకబు చేసికొచ్చికూడాను. ఆఫీసరు తిన్నగా స్పెన్సరు రెస్టారాంటులోకి వెళ్ళిపోయినాడు.

బిళ్ళబంట్రోతు తాను ఎరిగున్న పోర్టర్ కుఱ్ఱాడిద్వారా తన పెళ్ళానికి కబురెట్టాడు మెయిలులేటు మూడుగంటలు, తనకు కూడు ప్లాట్‌ఫారమ్‌మీదకు గంట గంటన్నరలో తెచ్చి పెట్టాలని.

బిళ్ళబంట్రోతు కాపరం ఆ వూరే. ఆఫీసరుగారు వారి ఆఫీసువుండే వూరూ అదే. ఇంటికివెళ్ళి తిరిగి స్టేషన్‌కువచ్చే టైమ్‌వున్నా ఆఫీసరుగారు యూరోపియన్ రిస్టారాంట్ ఛూస్ చేసుకు వుండిపోయినాడు. ఆఫీసరుగారు ఎక్కడవుంటే అక్కడ బిళ్ళబంట్రోతు ఆయన సెలవు అయిందాకా డవాలు కాపరుస్తూ తరాయించవలసిందే. ఆఫీసర్లకూ వాళ్ళ బిళ్ళబంట్రోతులుకు వున్న పరస్పర ధర్మసంబంధం అట్టిది.

ఎప్పుడు రిస్టారాంటు గదిలోంచి యివతలకు వస్తాడో అధికారి అని ఆలాగే డవాలేసుకు నిలబడి వున్నాడు ఓగంటన్నర

బంట్రోతు పేరు గంటయ్య. రూమ్‌లో గడియారం ఏడు కొట్టినా ఏడున్నర కొట్టినా అచ్చయ్యనాయుడుగారు ఈవలకు రాలేదు. లోపల పంకా ధ్వని వినిపిస్తూవుంది. బాటిల్ మీద బాటిల్ ఓపెన్ చేసిన చప్పుడవుతూనేవుంది. ఆఫీసరుగారు మంచి రసకంధాయ పట్టులో వళ్ళు తెలియకుండా వుండివుంటారని తల పోసి మెల్లిగా దవాలుతీసి తువాలున మూసి, ప్లాట్‌ఫారమ్ మీదకు అనతిదూరంలోవున్న ఆకాశమల్లె వృక్షం క్రిందకు చూచాడు గంటయ్య.

పైనుంచి తెల్లని పూలు ఒకటి రెండు తలమీద పడు తూంటే, శరత్కాల చంద్రిక ముఖంమ్మీద కాస్తూంటే, పరిమ ళానికి పరిమళం, చాయకు చాయకలిగి, ఏలోటూ లేనిదానికి మల్లే గంటయ్యకు గంటయ్యభార్య సోమాలమ్మ కనబడింది. వణ్ణం మూటకట్టితెచ్చి అక్కడ పెట్టుక్కూచుంది. పెనిమిట్ని పిలవడానికి భయం. పెనిమిటంక చూడ్డానికే భిడియం.

ఏమంటారా ? పబ్లిక్ ప్లాట్‌ఫారం అందులోనూ భర్త దవాలేసుకు ఉద్యోగ ఫాయాగా వున్నాడు ! పిలిస్తే ఏం తప్పో? అలికిడి గావిస్తే ఏం హానో ?

ఎప్పుడైతే గంటయ్య దవాలుతీసి మడతెట్టి తువాలున చుట్టాడో సోమాలమ్మకు ధైర్యంచిక్కి—“ ఓరేవ్ ! ఇక్క డున్నానురా !” అంది సన్నని తియ్యని గొంతెత్తి.

గంటయ్య ఆలి కంఠధ్వని ఆనవాలు బట్టుకుంటూ, మరి ఆఫీసరు అంతలో ఈవలకు రాడని ఊహించి, అడుగులు మెల్లంగా వేసుకుంటూ, ఆకాశ మల్లె క్రిందకు చేరుకున్నాడు. కోరకుండా పుష్పాలలా చేర్లలా చెటునుండి రాలుతూనేవునాయి.

ఓరచూపుల చందన్న చల్లని కిరణాలు ఆలా సోమాలమ్మ ముక్కు పుడకను తళుక్కు మనిపిస్తూనే వున్నాయి.

"మెయిలు మూడుగంటలు జాగ్రైతే గుడిసికే రాలేక పోయినావురా ?" అని అడిగింది సోమాలమ్మ ; తెల్లని ఉల్లిపొర చీర అదీ ఎంతో చోద్దెంగా ఎగిరేలోకాళ్ళమధ్దెనుండ బట్టుకుంటూ, కుచ్చెళ్ళ ఫెళ ఫెళ "నివ్వెల్లా వచ్చేసినాక చాకల్ది, ఇస్త్రీమడత చీరట్టుకొచ్చి ఇచ్చింద" ని కూడా చిలకపలుకులా పలికింది.

గంటయ్య వణ్ణమూట విప్పుకు భోంచెయ్యడమా ముందు, లేకుంటే సోమాలమ్మనో కవుగిలింతపాటు అనుభవించడమా అనే సమస్యలో పడ్డాడు ఒక్కక్షణం :

తక్షణం రిఫ్ట్యురాంటు తలుపులు తీసుకుంటూ దగ్గుకుంటూ ఆఫీసర్ అచ్చయ్యనాయుడు ఇవలకువస్తూ—"హూమ్ ! గంటయ్య ! ట్రిప్టేం ! లవ్ ట్రిక్కేం ! పిల్లతో సరసం ? ఎవరా కుఱ్ఱది ? ఇలా తీసుకురా ! తీసుకరాకపోతే బకమ్. నే—నే— నేను ఆలా వస్తూన్నాను !" అని తూలుతూ తూలుతూ బయలు దేరేడు.

గంటయ్యకు పైప్రాణాలు పైకెగిరిపోతున్నాయి. ఫూ లలాగే రాల్తున్నాయి. సోమాలమ్మ వొగుర్చుకుంటూ ఒకటే పరుగు ప్లాట్‌ఫారమ్ కటకటాల దొంగవెలితిబాటకోసం. ఆమె వెన్నె పండువెన్నెలలా కాస్తూనేవుంది.

ఎక్కణ్ణుంచి వచ్చిందో, అక్కడే కాసుకూర్చుందో—

తెచ్చిన అన్నంమూట గంటయ్య తినకుండానే—సిగ్నల్ కాబిన్ గోడలచాటుమాటు తిమిరంలోకి.

"కేబిన్‌లో కుక్క—సార్ !" అన్నాడు గంటయ్య తనకు ఆఫీసరు దరియడంలో డవాలేసుకు సరుదుకుంటూ. "అది ఆ కటకటాల్లో అదీ !" అన్నాడు ఆఫీసరు సోమాలమ్మను చూపిస్తూ. "ఆడకుక్క—సార్ !" అన్నాడు గంటయ్య. గబగబా రూమ్‌లోకివెళ్ళి చొక్కా—పట్టుకొచ్చి ఆఫీసరుగారికి తొడుగుతూ. "కాలిబూట్సుతే !" అన్నాడు అచ్చయ్యనాయుడు. తెచ్చి అవి కూడా ఆఫీసరు కాళ్ళకెక్కించాడు దుమ్ముతుడిచేసి. "హేట్ ?" "ఇదిగోసార్ !" అవి అందిచ్చాడు బంట్రోతు. "మెయిలు ఇంతలేటు ఎంచేతనో కనుక్కు—న్నావ్ ?" అన్నాడు ఆఫీసరు. "ఎక్క—డో ఎంజిన్ క్రింద గుంటనక్క పడివుంటుంది దార్లో" అన్నాడు గంటయ్య. "ఫూల్ ! కటకటాల్లో వెనుదిరిగి చూస్తూన్నాయిరా అవి దేవికళ్ళు ?" గంటయ్య—"పులికళ్ళు !"

ఆఫీసర్ వెంటనే తన నిక్కర్ పోకెట్‌లోంచి పిస్టల్‌తీసి ఆ కళ్ళకు గురిపెట్టాడు.

కటకటాలు, సోమాలమ్మవో రెండుమూడు గాజులు తుత్తినియలుగా, మెలితిరిగిపోయినాయి. గంటయ్య—"నా ఇల్లు! నేను వేసిన మూడుముళ్ళు ! మాఆడోళ్ళు !" అంటూ కావుకేకలు అరుస్తూ గుళ్ళబారుకూ కోమలాంగి గుండెలకు మధ్య అడ్డుగా నిలబడ్డాడు ! డవాల్‌బిళ్ళ కవచంగా !

ఆఫీసర్ అచ్చయ్య నాయుడు ఆశ్చర్య పోయాడు. "యువర్‌వైఫ్ !" అన్నాడు. ఆపె తెలివితెచ్చుకున్నాడు.

.... .... .... .... ....